ఏయూలో ఏం జరుగుతోంది?

ప్రసాదరెడ్డి బృందానికే కీలక పదవులు



- ఇన్‌చార్జి వీసీగా నియమితులైన శశిభూషణరావు అందులో సభ్యుడే
- ఎమ్మెల్యేలకు చెప్పకుండానే నియామకం
- తెరవెనుక చక్రం తిప్పిన టీడీపీ యువ నాయకుడు

...వివరాలు 7వ పేజీలో

సాగు, తాగునీటి వనరుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

గ్రామీణ రహదారులు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం
- పరిశ్రమల్లో భద్రతా చర్యలపై నిరంతరం నిఘా
- గ్రామాల్లో వైద్య సేవలపై దృష్టి
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో కలెక్టర్ విజయకృష్ణన్



విజయకృష్ణన్, కలెక్టరు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సాగు, తాగునీటి వనరుల అభివృద్ధితో పాటు గ్రామీణ రహదారులు, పల్లెల్లో పారిశుధ్య పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలకు పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామన్నారు. పోలవరం ఎడమ కాలువ పనులను పూర్తి చేసి అనకాపల్లికి గోదావరి జిల్లాలను తీసుకొస్తామని, ప్రజా ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ విజయకృష్ణన్ గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తన ప్రణాళికను వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

ఈ- ఆఫీస్ విధానంపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ కార్యాలయంలో ఈ-ఆఫీస్ విధానం చక్కగా అమలు జరుగుతోంది. భవిష్యత్తులో మండలాల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఈ-ఆఫీస్ విధానంలోనే ఫైల్స్ నడిచే విధంగా చర్యలు చేపడతాం. వివిధ పనులపై కార్యాలయాలకు వచ్చే ప్రజలకు పారదర్శక సేవలు అందిస్తాం.

ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ...

జిల్లాలో స్పీకర్, హోం మంత్రి, ఇతర ప్రజాప్రతినిధుల సమన్వయంతో జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తాం. జిల్లా ఏర్పడి రెండేళ్లయినా ఇంకా పూర్తిస్థాయి భవనాలు లేక అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు జరిగితే ఉద్యోగులకు ఇబ్బందులు ఉండవు. ఇప్పటికే స్థల సేకరణ పూర్తయింది. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించేలా ప్రయత్నాలు చేస్తాం.

అనకాపల్లికి గోదావరి జలాలు తీసుకొస్తాం

జిల్లాలో సాగు, తాగునీటి వనరుల సమస్యలు దీర్ఘకాలికంగా పేరుకుపోయాయని గుర్తించాం. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ఎస్.రాయవరం మండలంలో పోలవరం ఎడమ కాలువ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అరకొరగా నిలిచిపోయిన పోలవరం ఎడమ కాలువ పనులను పూర్తిచేసి, అనకాపల్లికి గోదావరి జలాలను తీసుకొచ్చే బాధ్యత తీసుకుంటున్నట్టు ప్రకటించారు. సీఎం ఆదేశాల మేరకు జల వనరుల శాఖ, పోలవరం ప్రాజెక్టు ఇంజనీర్లతో ఇప్పటికే సమీక్ష సమావేశం నిర్వహించాం. సీఎం ఆదేశాల మేరకు త్వరలోనే పోలవరం ఎడమ కాలువ పనులకు టెండర్లు పిలిచి ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి అనకాపల్లి ప్రాంతానికి నీరు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. జిల్లాలో జలవనరుల శాఖ పరిధిలో ప్రధాన సాగునీటి వనరులైన జలాశయాలు, వాటి అనుసంధానంగా ఉన్న పంట కాలువలు, గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. రైతులకు సాగునీటి కష్టాలు లేకుండా చర్యలు చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించాం.

పల్లెల్లో పారిశుధ్య సమస్యలపై శ్రద్ధ

గ్రామ పంచాయతీలు, అనకాపల్లి జీవీఎంసీ, నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీల పరిధిలో అపారిశుధ్య సమస్యలు ఎక్కువగా ఉన్నాయని ... మిగతా 8వ పేజీలో

ఏయూ ఇన్‌చార్జి వీసీగా శశిభూషణరావు

వర్సిటీకి చెందిన మరో ఇద్దరు ప్రొఫెసర్లకు ఇన్‌చార్జి వీసీలుగా అవకాశం

- ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్సిటీ వీసీగా డీవీఆర్ మూర్తి
- కడప ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ వీసీగా విశ్వనాథకుమార్



శశిభూషణరావు

విశాఖపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు విశ్వవిద్యాలయాలకు ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్లను నియమిస్తూ గురువారం ఉన్నత విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శశిభూషణరావును నియమించారు. జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా, ఏయూ ఆర్కిటెక్చర్ విభాగం ప్రొఫెసర్ జి.విశ్వనాథకుమార్ వైఎస్ఆర్ జిల్లాలోని ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా నియమితులయ్యారు.

శశిభూషణరావు బాధ్యతల స్వీకారం

ఏయూ ఇన్‌చార్జి వీసీగా నియమితులైన ప్రొఫెసర్ జి.శశిభూషణరావు గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంజనీరింగ్ కాలేజీలో ఈసీఈ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్. ప్రస్తుతం ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. బోధనలో 35 ఏళ్ల అనుభవం ఉంది. ఏయూలో బీటెక్, జేఎన్‌టీయూలో ఎంటెక్, ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేశారు. ఆయన పర్యవేక్షణలో 51 మంది డాక్టరేట్లు తీసుకున్నారు. 275కి పైగా పరిశోధన పత్రాలు ప్రచురితమయ్యాయి. ఐదు పాఠ్యపుస్తకాలు, వివిధ పుస్తకాల్లో 11 అధ్యాయాలు ఆయన రచించారు. ఆయన 2008లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ బెస్ట్ అకడమిషియన్ అవార్డును అందుకున్నారు. బెస్ట్ రీసెర్చర్ అవార్డు కూడా లభించింది. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా నియమితులైన ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి ఏయూ జర్నలిజం విభాగంలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం పరీక్షల విభాగం డీన్‌గా వ్యవహరిస్తున్నారు. జర్నలిజం విభాగం అధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, అంతర్జాతీయ భాషల అధ్యయన విభాగం డీన్‌గా, జపనీస్ సెంటర్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అంతకు ముందు ఆయన డెక్కన్ క్రానికల్ దినపత్రిక ఎడిటోరియల్ విభాగంలో పనిచేశారు. వైఎస్ఆర్ జిల్లాలోని ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా నియమితులైన ప్రొఫెసర్ జి.విశ్వనాథకుమార్ ప్రస్తుతం ఏయూలో ఆ విభాగం అధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

వైసీపీ నేతల గుప్పిట్లో లేటరైట్

నాతవరం మండలం భమిడికలొద్దిలో ఇప్పటికే తవ్వకాలు

- ఈ ఏడాది ప్రథమార్థంలో సుందరకోట పంచాయతీ తొర్రడ గ్రామంలో 19.88 హెక్టార్ల లీజుకు...
- గిరిజనుల పేరిట అనుమతులు
- తెర వెనుక అనపర్తికి చెందిన వైసీపీ నేత
- బినామీ వ్యవహారంపై కూటమి ప్రభుత్వం దృష్టి



సుందరకోట పంచాయతీ భమికలొద్ది దగ్గర గతంలో లేట్‌రైట్ తవ్వకాలు జరిగిన ప్రదేశం

విశాఖపట్నం/నాతవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): **వైసీపీ నేతలు గడచిన ఐదేళ్లుగా అనకాపల్లి జిల్లా నాతవరం మండలం సరుగుడు, సుందరకోట పంచాయతీల్లో ఇష్టానుసారం లేటరైట్ తవ్వకాలు సాగించారు. ప్రముఖ నేత కుమారుడు భమిడికలొద్దిలో లక్షల టన్నుల లేటరైట్‌ను తవ్వి తరలించుకుపోయాడు. అదేబాటలో అనపర్తి ప్రాంతానికి చెందిన మరో వైసీపీ నేత ఇద్దరు గిరిజనులను తెరపైకి తీసుకువచ్చి గత ఏడాది సుందరకోట పంచాయతీ తొర్రడ గ్రామ పరిధిలో లేటరైట్ తవ్వకాలకు లీజులు పొందాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారం వెనుక ఏడాదిపాటు కసరత్తు సాగింది.**

సుందరకోట పంచాయతీ భమిడికలొద్దిలో గిరిజనుల పేరిట వైసీపీ కీలక నేత కుమారుడు నాలుగేళ్ల క్రితం అడ్డగోలుగా లేటరైట్ తవ్వకాలు జరిపారు. వాటి తరలింపు కోసం రోడ్డు వేయడానికి అటవీ శాఖ భూమిలో వందల చెట్లు కొట్టేశారు. ఈ వ్యవహారం తీవ్ర దుమారం రేపడంతో గత ఏడాది చివరిలో తవ్వకాలను నిలిపివేశారు. అయితే లేటరైట్ ద్వారా రూ.కోట్లు ఆర్జించవచ్చునని గుర్తించిన వైసీపీ నేత ఒకరు (స్వస్థలం అనపర్తి ప్రాంతం..నివాసం విశాఖపట్నం) గనుల లీజులు ఇప్పించాలని అప్పటి ప్రభుత్వ పెద్దలను కోరారు. దీంతో గనుల శాఖ పూర్వపు డైరెక్టర్ రంగంలోకి దిగారన్న ప్రచారం సాగింది. వైసీపీ నేతలు సుందరకోట పంచాయతీ తొర్రడ గ్రామంలో కొండలపై 19.8 హెక్టార్లలో లేటరైట్ గనులున్నట్టు గుర్తించారు. స్థానికంగా కొందరు నాయకుల ప్రోత్సాహంతో లేటరైట్ తవ్వకాలకు అభ్యంతరం లేదని గత ఏడాది ఆగస్టు 23న సరుగుడు పంచాయతీ తీర్మానం, పీసా ఆమోదం తీసుకున్నారు. ఆ తరువాత నాతవరం మండల రెవెన్యూ అధికారులు గత ఏడాది సెప్టెంబరు ఏడో తేదీన సర్వే చేసి తవ్వకాలకు గుర్తించిన 19.88 హెక్టార్ల ప్రాంతం గ్యాప్ ఏరియాలో ఉన్నందున తమకు ఎటువంటి అభ్యంతరం లేదని పేర్కొంటూ గనుల శాఖకు నివేదిక పంపారు. ఈ నేపథ్యంలో లీజుల కోసం ఇద్దరు గిరిజనులు శోభా సత్యసాగర్, శోభా అప్పలరాజు పేరిట దరఖాస్తు చేశారు. ఆ ఇద్దరు గిరిజనులు సరుగుడు, సుందరకోట ప్రాంతానికి చెందినవారు కారని ఇక్కడ గిరిజనులు చెబుతున్నారు. లేటరైట్ గనుల లీజులు పొందేందుకు ఉన్నత స్థాయిలో వేసిన స్కెచ్ మేరకు తొలుత పంచాయతీ, పీసా కమిటీ తీర్మానాలు తీసుకున్నారు. తరువాత గత ఏడాది నవంబరులో ఈ-వేలం నిర్వహించారు. ఈ-వేలంలో ... మిగతా 8వ పేజీలో

పంట కాలువలకు మోక్షం

పూడికలు తొలగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం

- ప్రతిపాదనలు పంపిన అధికారులు
- రైతుల హర్షం



కె.కోటపాడు మండలం ఎ.కోడూరులో పూడుకుపోయిన పంట కాలువ

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పంట కాలువలకు మోక్షం కలగనుంది. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పంట కాలువలు పూడుకుపోయి నిరుపయోగంగా ఉన్న విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అత్యవసర పనుల కింద పంట కాలువల్లో పూడికలు తీయాలని నిర్ణయించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో రైవాడ, కోనాం, పెద్దేరు, కల్యాణపులోవ జలాశయాల పరిధిలో పంట కాలువల్లో పూడిక తొలగింపు పనులు పూర్తిస్థాయిలో చేపట్టలేదు. ఉపాధి హామీ పనుల పేరుతో మొక్కుబడిగా పనులు చేపట్టి కాలం గడిపేశారు. పలుచోట్ల కాలువ గట్లు కోతకు గురయ్యాయి. పూడిక చేరి మూసుకుపోయాయి. కాలువల్లో షట్టర్లు, గేట్లు, క్రాస్ రెగ్యులేటర్లు మరమ్మతులకు గురయ్యాయి. గత ప్రభుత్వం జల వనరుల శాఖ ద్వారా శిథిలమైన కాలువల మరమ్మతు పనులు చేపట్టేందుకు నిధులు విడుదల చేయలేదు. జిల్లాలో తాండవ, రైవాడ, కోణాం, వరహా, పెద్దేరు జలాశయాల కింద సుమారు 80 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇటీవల ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తుండడంతో గతం కంటే జలాశయాల నీటిమట్టాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులకు సాగునీరు అందించే లక్ష్యంతో కాలువల పనులకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈ మేరకు జిల్లాలో చేపట్టాల్సిన పనుల వివరాలు ఇవ్వాలని జల వనరుల శాఖ ఉన్నతాధికారులు ఆదేశించడంతో జిల్లా అధికారులు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. రైవాడ జలాశయ పరిధిలోని పంట కాలువకు 27 చోట్ల పనులు చేపట్టేందుకు రూ.2.87 కోట్లు అవసరమని అంచనాలు రూపొందించారు. చోడవరం, మాడుగుల మండలాల్లో కాలువలు, సాగునీటి చెరువుల మరమ్మతులకు రూ.76 లక్షలు, అనకాపల్లి, కశింకోట మండలాల్లో పంట కాలువల మరమ్మతు పనులకు రూ.84.8 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు పంపారు. జిల్లాలో వరి నారుమడులు ఇప్పుడిప్పుడే రైతులు సిద్ధం చేసుకొంటున్నారు. ఈ నెలాఖరుకు నారు తయారు చేసుకొని ఆగస్టు మొదటి వారం నుంచి రైతులు నాట్లు వేసేందుకు సమాయత్తమవుతున్నారు. ప్రతిపాదనల విషయంపై ఈఈ త్రినాథం మాట్లాడుతూ పంట కాలువల మరమ్మతులు, పూడిక తొలగింపు పనులకు ప్రతిపాదనలు పంపామని, నిధులు రాగానే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

జిల్లా అంతటా ముసురు

పలు చోట్ల ఉదయం నుంచి సాయంత్రం వరకు వాన



చోడవరంలో వర్షం

అనకాపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో ముసురు వాతావరణం నెలకొంది. పలు మండలాల్లో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తేలికపాటి జల్లులు కురిశాయి. అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, అచ్యుతాపురం, మాకవరపాలెం, మాడుగుల, గొలుగొండ, బుచ్చెయ్యపేట, కె.కోటపాడు, సబ్బవరం, పరవాడ, కశింకోట, మునగపాక మండలాల్లో ఉదయం నుంచి వర్షపు జల్లులు కురిశాయి. ఉదయం నుంచి దఫ దఫాలుగా వాన కురిసింది. కొన్ని మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిసి పొలాల్లో నీరు చేరుతుండడంతో రైతులు పొలం పనులకు సన్నద్ధమవుతున్నారు.

చోడవరంలో..

చోడవరం: వర్షాల కోసం అన్నదాతలు ఎదురుచూపులు చూస్తున్న సమయంలో చినుకు పలకరించింది. అల్పపీడన ప్రభావంతో గురువారం ఉదయం నుంచి రోజంతా వర్షం కురిసింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన వర్షపు జల్లులు సాయంత్రం వరకు కొనసాగాయి. దీంతో రహదారులు చిత్తడిగా మారాయి. వ్యవసాయ పనులకు ఊతమిచ్చే స్థాయిలో వర్షం పడడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది.

బీఎన్ రోడ్డు ఎప్పటికి బాగుపడేనో?

రహదారంతా గోతులమయం

- ఐదేళ్లుగా పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం
- వాహనదారుల అవస్థలు



బీఎన్ రోడ్డులో వడ్డాది బల్క్ మిల్క్ సెంటరు వద్ద చెరువును తలపిస్తున్న రహదారి

బుచ్చెయ్యపేట, జూలై 18: భీమునిపట్నం- నర్సీపట్నం (బీఎన్) రోడ్డు అడుగడుగునా గోతులతో అధ్వానంగా ఉంది. ఐదేళ్లగా గత వైసీపీ ప్రభుత్వం పట్టించు కోకపోవడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి చెరువును తలపిస్తున్నాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్ల క్రితం బీఎన్ రోడ్డు అభివృద్ధికి న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్‌డీబీ) రూ.84 కోట్ల నిధులు మంజూరు చేసింది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు గత వైసీపీ ప్రభుత్వం బిల్లుల చెల్లింపులు సక్రమంగా జరపకపోవడంతో రెండేళ్లుగా పనులు నిలిచిపోయాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనచోదకులు ప్రమాదాలకు గురవు తున్నారు. ముఖ్యంగా వడ్డాది, బంగారుమెట్ట కూడలి, ఎల్.సింగవరం, పొట్టిదొరపాలెం, బూదిరెడ్ల పాలెం, కోమళ్లపూడి వద్ద బీఎన్ రోడ్డుపై భారీ గోతులు ఏర్పడ్డాయి. వర్షం కురిస్తే గోతుల్లోకి నీరు చేరి ఏది రోడ్డో, ఏది గొయ్యో తెలియక వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డుపై ఏర్పడిన గోతులను పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఉపమాక పుష్కరిణి అధ్వానం

నాచు, వ్యర్థాలతో నిండిన వైనం

- ఐదేళ్లుగా పట్టించుకోని టీటీడీ అధికారులు



పుష్కరిణి చుట్టూ పెరిగిపోయిన నాచు

నక్కపల్లి, జూలై 18:

ఎంతో ప్రాశస్త్యం, చరిత్ర గల ఉపమాక వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన పుష్కరిణి చాలా అధ్వానంగా వుంది. ప్రస్తుతం ఉపమాక క్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) పరిధిలో వుంది. అయితే ఐదేళ్లుగా టీటీడీ నిర్లక్ష్యం వహిస్తోందని భక్తులు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వంలో ఈ ఆలయానికి మంచి రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గత ఐదేళ్లపాటు స్వామివారి పుష్కరిణితోపాటు ఆలయ అభివృద్ధిని టీటీడీ అధికారులు విస్మరించారనే విమర్శలు ఉన్నాయి. ఏడాది కిందట మొక్కుబడిగా పుష్కరిణిలో నాచు తొలగించే పనులు చేపట్టి చేతులు దులిపేసుకున్నారు. మళ్లీ స్వామివారి పుష్కరిణిలో నాచు, అనేక వ్యర్థాలు పెరిగిపోయాయి. 2015 నవంబరు 18న ఈ ఆలయాన్ని అప్పటి సీఎం చంద్రబాబు సూచనల మేరకు టీటీడీ స్వాధీనపరుచుకుంది. ఆ తరువాత మూడేళ్లపాటు పలు కార్యక్రమాలు, పనులను టీటీడీ అట్టహాసంగా చేపట్టింది. 2019 నుంచి 2024 వరకు ఉపమాక ఆలయాన్ని టీటీడీ చిన్నచూపు చూసిందన్న విమర్శలు ఉన్నాయి. మూడు నెలల తరువాత కార్తీకమాసం ప్రారంభమవుతుంది. అనేక మంది భక్తులు కార్తీక మాసంలో వెంకన్న పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరిస్తారు. ఈలోగా స్వామివారి పుష్కరిణిని శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని, పూర్తిగా నాచు తొలగించాలని భక్తులు కోరుతున్నారు. ఈ నెల 11న దార్లపూడి వచ్చిన సీఎం చంద్రబాబుకు ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి స్వామివారి పుష్కరిణి, ఆలయ అభివృద్ధిపై వినతిపత్రం అందజేశారు. హోం మంత్రి అనితకు ఉపమాక క్షేత్రం పరిస్థితిపై పూర్తి అవగాహన ఉంది. ఈ వారంలో జరగనున్న టీటీడీ ఉన్నత స్థాయి సమావేశంలో ఉపమాక ఆలయం గురించి ప్రస్తావించేలా చర్యలు తీసుకోవాలని హోంమంత్రి అనితను పలువురు కోరుతున్నారు.



కలెక్టర్, అధికారులతో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- కలెక్టర్‌కు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశం

నర్సీపట్నం, జూలై 18: మునిసిపాలిటీలో అస్తవ్యస్తంగా ఉన్న పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని కలెక్టర్ విజయకృష్ణన్‌ను స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. గురువారం స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కలెక్టర్ విజయకృష్ణన్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి పలు సమస్యలను అయ్యన్నపాత్రుడు తీసుకువెళ్లారు. మునిసిపాలిటీలో ఎక్స్‌కవేటర్, కంపాక్టర్ మరమ్మతులకు గురై కొన్ని నెలలు కావస్తున్నదని తెలిపారు. వాటికి రిపేరు చేయించకుండా అద్దెకు వాహనాలు తీసుకోవడం వల్ల మునిసిపాలిటీ ఆదాయం నష్టపోవల్సి వస్తుందని తెలిపారు. ఏరియా ఆస్పత్రికి పూర్వవైభవం తీసుకురావాలని, గబ్బాడ ఇసుక డిపోలో అవకతవకలపై సమగ్ర విచారణ చేయాలని ఆదేశించారు. వేములపూడి బాలికల వసతి గృహంలో మరుగుదొడ్లు లేక విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయరాం, కమిషనర్ పూడి రవిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

క్రైం... crime news

గంజాయి కేసులో ఐదేళ్లు జైలు

అనకాపల్లి టౌన్, జూలై 18: గంజాయి రవాణా కేసులో పట్టుబడిన ఒక వ్యక్తికి గురువారం పదవ అదనపు జిల్లా జడ్జి నందనవనం శ్రీవిద్య ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10వేలు జరిమానా విధించారని జిల్లా ఎస్పీ ఎం.దీపిక పాటిల్ తెలిపారు. 2018 నవంబరు రెండవ తేదీన స్టేషన్ రోడ్డులో ఎనిమిది కిలోల గంజాయితో ఏలూరు జిల్లా నూజివీడు ప్రాంతానికి చెందిన బొల్లా రాజును ఏఎస్ఐ వి. అప్పారావు తన సిబ్బంది పట్టుకున్నారు. దీంతో అప్పటి ఎస్ఐ వి.చక్రధరరావు నిందితుడు రాజును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. విచారణ పూర్తయిన తర్వాత జిల్లా న్యాయమూర్తి నిందితుడు రాజుకు ఐదేళ్ల కారాగార శిక్ష, రూ.10వేలు జరిమానా విధించినట్టు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసును పీపీ వడ్డాది వెంకటరావు, ఎస్ఐ చక్రధరరావు, సిబ్బంది, మోనటరింగ్ సెల్ సిబ్బందిని జిల్లా ఎస్పీ దీపిక అభినందించారు.

భవనం పైనుంచి పడి తాపీమేస్త్రీ మృతి


మృతుడు అమరపు సురేశ్ (ఫైల్ ఫొటో)

పరవాడ, జూలై 18 : మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి ప్రమాదవశాత్తూ కిందకు పడిపోవడంతో తాపీమేస్త్రీ మృతి చెందాడు. ఇందుకు సంబంధించి పరవాడ సీఐ బాల సూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలో బండారు సింహాచలం నాయుడు నూతన భవన నిర్మాణాన్ని చేపడుతున్నారు. దీనిలో భాగంగా గురువారం భవనం రెండో అంతస్తుపై పిట్టగోడ కడుతున్న తాపీమేస్త్రీ అమరపు సురేశ్(35) ప్రమాదవశాత్తూ కాలు జారి కిందకు పడిపోయాడు. దీంతో అతని తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే తోటి కూలీలతో పాటు భవన యజమాని చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే సురేశ్ మృతి చెందినట్టు నిర్ధారించారు. సురేశ్ స్వస్థలం విజయనగరం జిల్లా మక్కువ మండలంలోని పాయకపాడు గ్రామం. గత ఏడాదిన్నరగా గొర్లివానిపాలెం పంచాయతీ పరిధి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. మృతుడు సురేశ్‌కు భార్య స్వాతి, ఆరేళ్ల కుమార్తె, ఐదేళ్ల బాబు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి శుక్రవారం కుటుంబసభ్యులకు అప్పగిస్తామన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ బాల సూర్యారావు తెలిపారు.

క్షణికావేశంలో వ్యక్తి ఆత్మహత్య

గోపాలపట్నం, జూలై 18: పిల్లలు కరెన్సీ నోట్లు చింపేశారని క్షణికావేశంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రానికి చెందిన చందన్‌కుమార్(33) రైల్వేలో అసిస్టెంట్ లోకో పైలెట్‌గా పని చేస్తున్నారు. ఆయన భార్య లాల్ మున్నీకుమారి, ఇద్దరు పిల్లలతో కొత్తపాలెం గణపతినగర్‌లో ఐదేళ్లగా నివసిస్తున్నారు. బుధవారం రాత్రి చందన్‌కుమార్ పిల్లలు ఆయన జేబులోని కొన్ని కరెన్సీ నోట్లను తీసి చింపేశారు. దీంతో ఆయన తన గదిలోకి వెళ్లి క్షణికావేశంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎంతసేపటికీ భర్త గది తలుపులు తీయకపోవడంతో అనుమానంతో మున్నీకుమారి చుట్టుపక్కల వారి సాయంతో బలవంతంగా తలుపులు తెరిచి చూడగా చందన్‌కుమార్ ఉరి వేసుకుని ఉండడంతో గోపాలపట్నం పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించి, ఆత్మహత్యకు గల కారణాలను మున్నీకుమారిని అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి సీఐ సురేశ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

» కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణనష్టం జరగకుండా యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన వివిధ విభాగాల అధికారులతో సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో 213 హానికర, రెడ్ కేటగిరీ కింద 143 పరిశ్రమలను పరిశీలించామన్నారు. మిగిలిన 70 పరిశ్రమలను పరిశీలించాల్సి ఉందని వివరించారు. రాబోయే నెల రోజుల్లో 40 పరిశ్రమలను పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించి, పరిశ్రమల్లో పాటిస్తున్న భద్రత ప్రమాణాలపై నివేదిక తయారు చేయాలన్నారు. గతంలో తనిఖీలు చేసిన 143 పరిశ్రమలను కూడా మళ్లీ వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించి, భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఆర్డీవో చిన్నికృష్ణ, జిల్లా పరిశ్రమల శాఖాధికారి చిన్నికృష్ణ, డీఆర్‌ఓ శ్రీనివాసరావు,అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై వీడియో కాన్ఫరెన్స్

వైద్య, ఆరోగ్యశాఖ, ప్రకృతి వైపరీత్యాలు, పంచాయతీరాజ్ శాఖలపై గురువారం జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ విజయకృష్ణన్, డీఆర్‌ఓ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌ఓ బాలాజీ, జడ్పీ సీఈఓ పోలినాయుడు పాల్గొన్నారు.

లెప్రసీ కేస్ నిర్ధారణ సర్వే తనిఖీ


ఎల్‌సీడీసీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ

పాయకరావుపేట, జూలై 18 : స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటికి తిరిగి చేపడుతున్న లెప్రసీ కేస్ నిర్ధారణ సర్వేని గురువారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ బాలాజీ పరిశీలించారు. పట్టణంలో సచివాలయం-4, 5 పరిధిలో పర్యటించిన ఆయన సిబ్బంది చేపట్టిన సర్వే వివరాల రికార్డులను తనిఖీచేసి, పలు సూచనలు చేశారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సుభాష్, డాక్టర్ మీఎస్.సౌందర్య తదితరులున్నారు.

వసంత్ కెమికల్స్‌లో ప్రమాదంపై ఎంపీ దిగ్భ్రాంతి

తుమ్మపాల, జూలై 18 : రాంబిల్లి మండలంలో వసంత్ కెమికల్స్ ప్రొడక్షన్ బ్లాక్-6లో బుధవారం జరిగిన ప్రమాదంపై అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఒడిశాకు చెందిన ప్రదీప్‌రౌత్ అనే కార్మికుడు మృతి చెందడంపై విచారం వెలిబుచ్చారు. ప్రమాదానికి కారణాలపై సమగ్ర విచారణ చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

అప్పన్న దర్శన వేళల్లో మార్పులు

సింహాచలం, జూలై 18 : ఈనెల 21న తుది విడత చందన సమర్పణ, 20న సింహగిరి ప్రదక్షిణ పురస్కరించుకుని వరాహలక్ష్మీనృసింహస్వామి అంతరాలయ దర్శనాలు, అన్ని రకాల ఆర్జిత సేవలను రద్దు చేసినట్టు ఈఓ శ్రీనివాసమూర్తి తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 20న ఉదయం 6.30 నుంచి 2.30 వరకు లఘు దర్శనాలు, 2.30 నుంచి 3 గంటల వరకు పవళింపు సేవ విరామం తరువాత రాత్రి 7 గంటల వరకు, 7 నుంచి రాత్రి 8.30 గంటల వరకు రాత్రి ఆరాధన విరామం తరువాత తిరిగి 10 గంటల వరకు దర్శనాలు కల్పిస్తారు. 21న వేకువజామున 2.00 గంటలకు సుప్రభాత (ఏకాంత) సేవ, 3.00 వరకు స్వామివారికి తుది విడత చందన సమర్పణ, 3 నుంచి ఆలయ ప్రదక్షిణలకు బయట ప్రాకారం చుట్టూ అనుమతిస్తారు. 3 నుంచి 4.30 వరకు ప్రభాతారాధనలు, బాల భోగం, రాజభోగం నివేదలు. ఉదయం 5.00 నుంచి సాయంత్రం 4.00 వరకు నిర్విరామంగా భక్తులకు దర్శనాలు లభిస్తాయి. సాయంత్రం 4 నుంచి 5.30 వరకు ఆలయ బేడా మండపంలో ఢిల్లీ విజయం ఉత్సవం కావడంతో దర్శనాలు లభించవు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 వరకు దర్శనాలు కలిపించి, రాత్రి 7 నుంచి 8.30 వరకు రాత్రి ఆరాధన, 8.30 నుంచి రాత్రి 9 వరకు తిరిగి భక్తులకు దర్శనాలు లభిస్తాయి. భక్తుల రద్దీ దృష్ట్యా ఈనెల 20, 21 తేదీల్లో ఎటువంటి సిఫార్సు లేఖలను అనమతించమని ఈఓ స్పష్టం చేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

అమర్‌నాథ్ భూ దందాల చిట్టా సిద్ధం

» మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

తుమ్మపాల, జూలై 18: వైసీపీ పాలనలో మంత్రిగా పనిచేసిన గుడివాడ అమర్‌నాథ్ నియోజకవర్గంలో సాగించిన భూదందాల చిట్టా సిద్ధమైందని, త్వరలో జైలుకు వెళ్లడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ స్పష్టం చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కశింకోట మండలం విసన్నపేట సర్వే నంబరు 195/2లో దాదాపు 600 ఎకరాలు, అనకాపల్లి మండలం బీఆర్టీ కాలనీ సర్వే నంబరుల్లో 81, 371ల్లో దాదాపు 88 ఎకరాలు, అనకాపల్లి మండలంలో జరిగిన ల్యాండ్ పూలింగ్‌లో సేకరించిన 1500 ఎకరాల్లో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో పాటు పలువురు వైసీపీ నాయకులు భూదందాలకు పాల్పడ్డారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అందరి భరతం పట్టడం ఖాయమన్నారు. ఈ అంశం పై ఇప్పటికే రెవెన్యూ మంత్రితో మాట్లాడడం జరిగిందన్నారు. పూర్తి ఆధారాలతో చిట్టాను టీడీపీ అధిష్ఠానానికి అందజేయడం జరిగిందన్నారు. గత ఐదేళ్లలో ఉమ్మడి విశాఖ జిల్లాలో వైసీపీ నాయకులు భారీ భూకబ్జాలకు పాల్పడ్డారన్నారు. ప్రధానంగా విజయసాయిరెడ్డి, గుడివాడ అమర్‌నాథ్‌తో పాటు అప్పటి సీఎస్‌గా పనిచేసిన జవహర్‌రెడ్డి సైతం ఉన్నారన్నారు. ఈ భూదందాలపై గతంలో జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజా దర్బార్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పేరిట పంపిణీ చేసిన మెటీరియల్ సైతం భారీగా దోచుకుని కోట్లాది రూపాయల అక్రమాలకు పాల్పడ్డారన్నారు. గత వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టి అవినీతి నాయకులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర, బీఎస్ఎంకే జోగినాయుడు, నారపిన్ని చంద్రశేఖర్, సందిన సునీల్, సబ్బవరపు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీగా పని చేస్తే ఉండండి.. లేకుంటే బదిలీపై వెళ్లిపోండి

» ప్రభుత్వ భూములు ధారదత్తం చేస్తే కఠిన చర్యలు

» ఎలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్ హెచ్చరిక


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, జూలై 18: నిజాయితీగా పని చేస్తే ఉండండి.. లేకుంటే బదిలీపై వెళ్లిపొండి అని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ హెచ్చరించారు. గురువారం స్థానిక ఒక ప్రైవేటు సమావేశమందిరంలో జరిగిన ఎలమంచిలి నియోజకవర్గం కార్యదర్శులు, వీఆర్వోల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతమంది ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వహించకుండా రాజకీయ నేతల ప్రాపకం కోసం ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇకపై అటువంటివి సాగవని, సక్రమంగా విధులు నిర్వహించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గి ప్రభుత్వ భూముల రికార్డులు ధారాదత్తం చేస్తున్నారని, బుధవారం కూడా ఎలమంచిలిలో ఇదే విధంగా పదెకరాల భూమి వ్యవహారాన్ని తాను అడ్డుకున్నానన్నారు. ఇలా గతంలో చేతివాటం చేసిన వారందరిపై తప్పకుండా కఠిన చర్యలు చేపడతానన్నారు. మండలంలో ప్రతి పనికి రైతుల నుంచి వసూళ్లు చేశారని, ఆ పద్ధతి మార్చుకోవాలన్నారు. జీతం చాలడం లేదని తనతో చెబితే ఉద్యోగాలకు రాజీనామా చేసి తన వద్దకు వస్తే కాంట్రాక్టు పనులు ఇప్పిస్తానన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఎంపీడీఓ సురేష్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డీపీఓ శిరీషారాణి, నాలుగు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో మెరుగైన సేవలకు చర్యలు


మొక్క నాటుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

» త్వరలో ఆస్పతి అభివృద్ధి కమిటీ సమావేశం

» కలెక్టర్ విజయకృష్ణన్

నర్సీపట్నం, జూలై 18: ఏరియా ఆస్పత్రికి వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. గురువారం నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో జయరాం కార్యాలయం ఆవరణలో ఆమెతో మొక్క నాటించారు. కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బందిని పరిచయం చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో పిచ్చి మొక్కలు మొలిచి ఉండడాన్ని గమనించిన ఆమె... సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని శుభ్రం చేయించాలని ఆదేశించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ త్వరలో ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. మునిసిపాలిటీలో పారిశుధ్య సమస్య పరిష్కారానికి స్పీకర్ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. శానిటేషన్, ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్‌పై సమీక్ష చేసి మునిసిపాలిటీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

కార్యాలయాల్లో మహిళల రక్షణకు కమిటీలు ఏర్పాటు

» తహసీల్దార్ కార్యాలయంలో కమిటీ ఏర్పాటు


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న శశికళ

అనకాపల్లి టౌన్, జూలై 18: మహిళలు పనిచేసేచోట వారి భద్రత కోసం ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోంది. దీంట్లో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్నెల్ కంప్లయింట్ కమిటీలను నియమిస్తోంది. కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళలపై లైంగిక వేధింపులు జరగకుండా చూడడం కోసం ఐదుగురు సభ్యులతో కమిటీలను వేస్తున్నది. ఇందులో భాగంగా ఐసీడీఎస్ అదనపు సీడీపీవో శశికళ గురువారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తహసీల్దార్ శ్రీనివాసరావుతో కమిటీ నియామకంపై చర్చించారు. ఈ కమిటీలో ఒక ప్రీసైడింగ్ అధికారి, ముగ్గురు సభ్యులు, ఒక ఎన్‌జీవో ఉంటారని శశికళ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళలు పనిచేసే కార్యాలయాల్లో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని ఆమె తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో కూడా ఒక కమిటీని నియమించారు. అన్ని కార్యాలయాల్లోనూ కమిటీలను నియమించడం జరుగుతుందన్నారు. ఏ కార్యాలయంలోనైనా మహిళా ఉద్యోగులు లైంగిక వేధింపులకు గురైతే కమిటీకి ఫిర్యాదు చేయవచ్చు. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లిన తరువాత సమస్య పరిష్కారమయ్యేలా అధికారులు చొరవ చూపుతారు. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ కమిటీల నియామకాలు జిల్లా వ్యాప్తంగా సాగుతున్నాయి.

హెల్మెట్‌తో ప్రజలకు రక్షణ

» అనకాపల్లి జిల్లా జడ్జి శ్రీవిద్య » హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

అనకాపల్లి టౌన్, జూలై 18 : ప్రమాదాల నుంచి రక్షించుకునేందుకు వాహనచోదకులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని పదవ అదనపు జిల్లా ఎన్. శ్రీవిద్య సూచించారు. అనకాపల్లి మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రమాదాలపై అవగాహన కల్పించడంలో భాగంగా న్యాయమూర్తులు, న్యాయవాదులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో కుటుంబాలు ప్రమాదాల వల్ల రోడ్డు పాలవుతున్నారన్నారు. ప్రమాదాల నివారణలో భాగంగా వాహనచోదకులు, వాహనం వెనుక కూర్చున్నవారు సైతం హెల్మెట్ ధరిస్తే మంచిదని సూచించారు. కోర్టు సముదాయాల నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి రమేష్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంజేవీఎస్ కుమార్, కార్యదర్శి దుర్గారావు, మహిళా ప్రతినిధి కేతా కుసుమ, ట్రాఫిక్ సీఐ పి. పైడపునాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నాక్ గుర్తింపు బృందం ఏఎంఏఎల్ కళాశాల సందర్శన


మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

కొత్తూరు, జూలై 18 : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలను నాక్ గుర్తింపు బృందం గురువారం సందర్శించింది. హిమాచల్‌ప్రదేశ్ సెంట్రల్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ హన్స్‌రాజ్ శర్మ, తమిళనాడు కోయంబత్తూరు హోమ్ సైన్స్ అండ్ హైర్ ఎడ్యుకేషన్ ఆఫ్ ఉమెన్ డీన్ డాక్టర్ జెరీనాబి ఉబైదుల్లా, కర్ణాటక ఏపీ.కాంతమ్మ ఉమెన్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజకుమారి జవరాజిగౌడ, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కళాశాలలోని వసతి, సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఈ బృందానికి కళాశాల ప్రాముఖ్యతను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వివరించారు. ప్రొఫెసర్ హన్స్‌రాజ్ శర్ మాట్లాడుతూ కళాశాలకు సంబంధించి పూర్తి సమాచారం సేకరించి, ఆ నివేదికను ఉన్నత స్థాయి అధికారులకు అందజేస్తామని చెప్పారు. అంతకు ముందు బృందం సభ్యులు కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు గౌరవవందనాన్ని సమర్పించారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డేడ అప్పారావు, పెనుమత్స కృష్ణంరాజు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐజీ మళ్ల వెంకటేశ్వరరావు, మెడికల్ అండ్ హెల్త్ రాష్ట్ర సంచాలకులు కర్రి అప్పారావు, ప్రొఫెసర్ ఎంపీ.కామరాజు, ప్రముఖ వైద్యులు డాక్టర్ జేపీవీ సుబ్రహ్మణ్యం, డాక్టర్ కర్రి భాస్కరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయబాబు, కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కొండెంపూడిలో స్వాధీన భూములకు పోలీసుల పహారా


స్వాధీనం చేసుకున్న భూములకు పహారా కాస్తున్న పోలీసులు

బుచ్చెయ్యపేట, జూలై 18: మండలంలోని కొండెంపూడి రెవెన్యూ సర్వే నంబరు 5లో గల ఐదు ఎకరాల స్వాధీన భూములకు బుచ్చెయ్యపేట పోలీసులు పహారా కాస్తున్నారు. 1993లో కడియాల రామారావు, సాంబశివరావులకు ప్రభుత్వం డీ ఫారమ్ పట్టాలు మంజూరు చేసింది. వారు లంకా సత్యనారాయణ, పినపాత్రుని వెంకటరమణ, సత్యనారాయణ, సోమిరెడ్డి రాము, గొల్లవిల్లి ఈశ్వరరావులకు లీజుకు ఇచ్చారు. 2014-19 సంవత్సరంలో కొండెంపూడిలో ఏర్పాటు చేసిన కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు గ్రామానికి చెందిన పలువురు రైతులకు చెందిన సుమారు 50 ఎకరాల బంజర్ల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులు సర్వే నంబరు 5లో భూములను కేటాయించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన భూ నిర్వాసిత రైతులు ఎ.సత్యనారాయణ, దొండా శ్రీను ఆధ్వర్యంలో కొంత మంది నిర్వాసిత రైతులు సర్వే నంబరు 5లో గల భూములను ట్రాక్టరుతో దున్నేశారు. దీంతో భూ నిర్వాసితులు, లీజుదారులకు వారి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకున్నాయి. దీంతో ఎస్ఐ డి.ఈశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను శాంతింపజేశారు. ఈ భూములు డీ ఫారమ్ పట్టా భూములని, తాము పట్టాదారుడి నుంచి లీజుకు తీసుకున్నామని లీజుదారులు తెలిపారు. పట్టాలు మంజూరు కాలేదని భూ నిర్వాసితులు ఆరోపించారు. ఇతర ప్రాంతంలో ఉన్న డీ ఫారమ్ పట్టాదారులు స్టేట్‌మెంట్ ఇచ్చే వరకు రెవెన్యూ అధికారులు సర్వే నంబరు 5లో భూములను స్వాధీనం చేసుకున్నట్టు ప్రకటించి, బోర్డు పెట్టారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, ఇరువర్గాలు భూముల్లోకి రాకుండా స్వాధీనం చేసుకున్న భూముల వద్ద గురువారం పోలీసు భద్రత కల్పించారు.

గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయాలి

» ఎస్పీ దీపికకు స్పీకర్ ఆదేశం


స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కలిసిన ఎస్పీ ఎం.దీపిక

నర్సీపట్నం, జూలై 18: జిల్లాలో గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఎం.దీపికను స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. స్పీకర్ అయ్యన్నను గురువారం ఎస్పీ దీపిక మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో గంజాయి విచ్చలవిడిగా దొరుకుతుండడంతో యువత పెడదోవ పడుతోందని తెలిపారు. గంజాయి రవాణాను అరికట్టి, నేరాల సంఖ్య తగ్గే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీని ఆదేశించారు. కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు అవసరమైన స్థలాలు పరిశీలిస్తే, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లి వాటి నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గంజాయి నియంత్రణకు ప్రత్యేక నిఘా


మాకవరపాలెం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ దీపిక

మాకవరపాలెం, జూలై 18: గంజాయి రవాణాను నియంత్రించడానికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని నర్సీపట్నం రూరల్ సీఐని ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. గురువారం ఆమె మాకవరపాలెం పోలీస్ స్టేషను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కంచాలన్నారు. అలాగే చెడు ప్రవర్తన ఉన్న వ్యక్తులపై నిరంతరం నిఘా కొనసాగించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఉన్న గంజాయి వాహనాలు, స్టేషన్ రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట నర్సీపట్నం రూరల్ సీఐ హరినాథ్, మాకవరపాలెం ఎస్ఐ రామకృష్ణారావు వున్నారు.

ఏయూలో ఏం జరుగుతోంది?

» ప్రసాదరెడ్డి బృందానికే కీలక పదవులు

» ఇన్‌చార్జి వీసీ శశిభూషణరావు అందులో సభ్యుడే

» ఎమ్మెల్యేలకు చెప్పకుండానే నియామకం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సంబంధించి గత నెల రోజులుగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు అందరినీ విస్మయానికి గురిచేస్తున్నాయి. మొన్నటి వరకు వీసీగా పనిచేసిన ప్రసాదరెడ్డి యూనివర్సిటీని వైసీపీ కార్యాలయంగా మార్చేశారు. అన్ని విభాగాలను తన మనుషులు, వైసీపీ అనుకూలురుతో నింపేశారు. తప్పనిసరి స్థితిలో పదవికి రాజీనామా చేశారు. ఆయన వెళుతూ వెళుతూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా కిశోర్‌ను నియమించారు. ఆయన ప్రసాదరెడ్డి మనిషి. అటువంటి వ్యక్తి నియామకానికి కూటమి ప్రభుత్వం ఎలా అంగీకరించిందన్నది ఇప్పటికీ ఎవరికీ అంతుబట్టడం లేదు. అందులో నుంచి తేరుకోకముందే గురువారం ఇన్‌చార్జి వీసీగా ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శశిభూషణరావును నియమించడం, ఆయన బాధ్యతలు స్వీకరించడం జరిగిపోయాయి. ఆయన కూడా ప్రసాదరెడ్డి బృందంలో చాలా ప్రధానమైన వ్యక్తి. వీసీ పదవిలో ప్రసాదరెడ్డి ఉంటే ఏమి చేస్తారో...శశిభూషణరావు ఉన్నా అదే చేస్తారనే ప్రచారం క్యాంపస్‌లో ఉంది. ప్రసాదరెడ్డి తన హయాంలో టీడీపీ సానుభూతిపరులైన సిబ్బందిని తీవ్రంగా వేధించారు. బోధన సిబ్బందికి పదోన్నతులు కల్పించకుండా, ఇతర అవకాశాలు ఏమీ దక్కకుండా తొక్కేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చినా అదే పరిస్థితి కొనసాగేలా ఉంది. వీసీ పదవికి ప్రసాదరెడ్డి రాజీనామా చేసిన ఇప్పటికీ యూనివర్సిటీలో ఆయన మాటే వేదంగా సాగుతోంది. ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్లు ఇద్దరూ ఆయన మనుషులే కావడం గమనార్హం. ఈ నియామకాలకు సంబంధించి పార్టీ అధిష్ఠానం జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేలెవరితోను సంప్రతించలేదు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు విశాఖలోనే ఉన్నారు. ఆయన భార్య లావణ్య ఏయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్. ఆమె ఎన్నికల ప్రచారం పాల్గొన్నారని ప్రసాదరెడ్డి సస్పెండ్ చేయించారు. అన్ని వేధింపులు ఎదుర్కొన్న పల్లాకు కూడా ఏయూ ఇన్‌చార్జి వీసీని నియమిస్తున్న విషయం చెప్పలేదని సమాచారం.

యువ నాయకుడి సిఫారసు

జిల్లాలో టీడీపీ యువ నాయకుడిగా చెలామణి అవుతున్న వ్యక్తి కూటమి అధికారంలోకి రాగానే పదవులు ఇప్పిస్తానంటూ ప్రచారం చేసుకున్నారు. ఇప్పుడు ఏయూ ఇన్‌చార్జి వీసీ నియామకం వెనుక ఆయన సిఫారసు ఉందని ప్రచారం జరుగుతోంది. ఆయన టీడీపీలో ఉంటూ వైసీపీకి చెందిన వారికి పదవులు ఇమ్మని ఎలా సిఫారసు చేశారు?, దానిని పెద్దలు ఎలా ఆమోదించారు? అనేది ఎవరికీ అర్థం కావడం లేదు.

సింహాద్రి ఎన్టీపీసీకి ఈహెచ్ఎస్ అవార్డు


ఈహెచ్ఎస్ అవార్డుతో పాటు సర్టిఫికెట్

పరవాడ, జూలై 18 : పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి చేస్తున్న సింహాద్రి ఎన్టీపీసీకి గ్లోబల్ ఈహెచ్ఎస్-2024 అవార్డు వరించింది. థాయిలాండ్‌లోని గ్రీన్ టెక్ ఫౌండేషన్ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. పర్యావరణ పరిరక్షణకు నిరంతర కృషి చేస్తున్నందుకు గ్రీన్‌టెక్ సంస్థ అవార్డుకు ఎంపిక చేసింది. బుధవారం అవార్డుతో పాటు సర్టిఫికెట్ కూడా అందజేసినట్టు సింహాద్రి ఎన్టీపీసీ పీఆర్‌ఓ అఖిలేష్ త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు.

హోం మంత్రి అనితను ఆదర్శంగా తీసుకోవాలి

▸ 9, 10 తరగతుల్లో హోం మంత్రి బ్యానర్లు

▸ మహిళా సాధికార సదస్సులో ఎంఈఓ కేఎన్ గాంధీ



హోం మంత్రి అనితకు అభినందనలు తెలియజేస్తున్న ఉపాధ్యాయినులు

పాయకరావుపేట, జూలై 18: ఉపాధ్యాయురాలి నుంచి రాష్ట్ర హోం మంత్రి స్థాయికి ఎదిగిన వంగలపూడి అనితను విద్యార్థినులు ఆదర్శంగా తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి కేఎన్ గాంధీ అన్నారు. గురువారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికార సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మహిళలు ఉన్నత విద్య అభ్యసించి సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. సమస్యలను దీటుగా ఎదుర్కొనడంతోపాటు ప్రశ్నించే శక్తి స్త్రీకి ఉండాలన్నారు. బాలికలకు విద్యనందించడంతోపాటు వారి ఎదుగుదలకు ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా నిలుస్తారన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయినిగా పనిచేసి రాజకీయ రంగ ప్రవేశం చేసిన వంగలపూడి అనిత రాష్ట్ర హోం మంత్రి కావడం మహిళా సాధికారతకు అద్దంపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఆమెకు అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. విద్యార్థినులు హోం మంత్రిని ఆదర్శంగా తీసుకుని విద్యావంతులుగా తయారై సామాజిక సేవ చేస్తూ ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించాలన్నారు. ఇందుకోసం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల్లో 9,10 తరగతి గదుల్లో రాష్ట్ర హోం మంత్రి బ్యానర్లను ఏర్పాటు చేయనున్నామని ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.స్వప్న, ఎంఈఓ-2 రమేష్, పాఠశాల హెచ్ఎం భవానీతోపాటు పలువురు మహిళా ఉపాధ్యాయినులు, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల గుప్పిట్లో లేటరైట్

... 5వ పేజీ తరువాయి

శోభా సత్యసాగర్ రూ.70.12 లక్షలు, శోభా అప్పలరాజు రూ.70.19 లక్షల ప్రీమియంకు టెండరు కోట్ చేశారు. తరువాత వీరికి 20 ఏళ్లకు లీజు మంజూరుచేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వెంటనే ఇద్దరు లీజుదారులు తాము కోట్ చేసిన విధంగా ప్రీమియం మొత్తం గత డిసెంబరులోనే చెల్లించడంతో అప్పటి గనుల శాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. ఇద్దరు లీజుదారులకు ఈ ఏడాది ఫిబ్రవరి 21న లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌వోఐ) జారీచేయగా వాటి ప్రతులు ఆ మరుసటిరోజు అంటే 22న నర్సీపట్నంలో గనుల శాఖ సహాయ సంచాలకుల కార్యాలయానికి అందాయి. నిబంధనల మేరకు ఎల్‌వోఐ జారీ చేసిన తేదీ నుంచి మూడేళ్లలో మైనింగ్ ప్లాన్‌ను గనుల శాఖకు అందజేయాలి. తరువాత పర్యావరణ, అటవీ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. ఇంకా తవ్వకాలకు కాలుష్య నియంత్రణ మండలి నుంచి కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్ (సీఎఫ్ఏ), తరువాత కన్సెంట్‌ఫర్‌ఆపరేషన్స్ (సీఎఫ్‌వో) తీసుకుని గనుల శాఖకు అందజేస్తే అప్పుడు లేటరైట్ తవ్వుకోవడానికి అధికారికంగా అనుమతులు జారీచేస్తారు. అయితే గత ప్రభుత్వ హయాంలో బినామీల పేరిట వైసీపీ నేతలు సుందరకోట పంచాయతీలో లేటరైట్ తవ్వకాలకు లీజులు పొందిన విషయం కొత్త ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. దీనిపై విచారణ జరపాలని భావిస్తున్నట్టు సమాచారం.

నీటి వనరుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

... 5వ పేజీ తరువాయి

గుర్తించాం. ప్రధానంగా గ్రామ పంచాయతీల పరిధిలో పరిశుభ్రత పనులు నిర్వహించి పల్లె ప్రజలు ఆరోగ్యంగా ఉండే విధంగా అవసరమైన అన్ని చర్యలు చేపడతాం. ఇప్పటికే మునిసిపల్, గ్రామ పంచాయతీ అధికారులతో పల్లెల్లో పారిశుధ్యం మెరుగుదలకు అవసరమైన పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించాం.

ప్రజా ఫిర్యాదులపై జవాబుదారీతనం

రెవెన్యూ శాఖలో ప్రజా ఫిర్యాదులు ఎక్కువ సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నట్టు గుర్తించాం. భూ వివాదాలు, రెవెన్యూ రికార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం దరఖాస్తులు ఎక్కువగా వస్తున్నాయి. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మండలాలు, చిన్న గ్రామాల నుంచి ప్రజలు వస్తున్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నాం. 30 రోజుల గడువులోగా అర్జీకి మొక్కుబడిగా సమాధానం చెబుతున్న అధికారుల వివరాలను సేకరిస్తున్నాను. ఇందులో భాగంగానే శాఖల వారీగా ప్రతి వారం అర్జీలు ఎన్ని వస్తున్నాయనేది గుర్తిస్తున్నాం.

పరిశ్రమల్లో భద్రతా చర్యలపై నిఘా

జిల్లాలో 183 పరిశ్రమలు ఉన్నాయి. ఆయా పరిశ్రమల్లో వేలాది మంది ఉద్యోగులు, కార్మికులు ఉన్నారు. ఇటీవల అచ్యుతాపురంలోని ఫార్మా కంపెనీలో అగ్ని ప్రమాదం జరిగి ఓ కార్మికుడు చనిపోవడం విచారకరం. గతంలోనూ ఇటువంటి సంఘటనలు అనేకం ఫార్మా కంపెనీల్లో జరిగాయి. తరచూ ప్రమాదాలు జరగడానికి గల కారణాలను గుర్తించి, శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టే దిశగా పరిశ్రమల శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. పరిశ్రమల్లో భద్రతా చర్యలు ఎలా ఉన్నాయని ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన సిబ్బంది కొంత నిర్లక్ష్యం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇక ముందు తనిఖీల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించాం. పరిశ్రమల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి భద్రతా చర్యల విషయంలో రాజీ పడవద్దని సూచించాం.

జ్వరాల తీవ్రతపై అప్రమత్తం

జిల్లాలో వర్షాలు కురుస్తుండడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కొన్నిచోట్ల వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. వైద్య సిబ్బంది గ్రామాల్లోనే ఉండి వైద్యపరమైన సేవలు అందించాలని ఆదేశించాం. అవసరం మేరకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, మలేరియా రక్తపూతల సేకరణ జరిపి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలని ఆదేశించాం. మందుల కొరత లేకుండా ముందస్తు ఇండెంట్ పెట్టుకొని అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాం.

మౌలిక వసతుల మెరుగుకు చర్యలు

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. తక్షణం మరమ్మతులు చేయాల్సిన రోడ్ల వివరాలు సేకరించాలని ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖాధికారులను ఆదేశించాం. పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణ పనులు చాలా వరకు పూర్తికాలేదు. ఎన్నికల ముందు నిలిచిపోయిన నిర్మాణ పనులను పూర్తి చేయాలని సర్వశిక్షా అభియాన్ అధికారులు, విద్యాశాఖాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశాం.

హెల్మెట్ ధారణతో ప్రమాదాలు దూరం

▸ సీనియర్ సివిల్ జడ్జి విజయ



కోర్టు ఆవరణ నుంచి ప్రారంభమైన ర్యాలీలో సీనియర్ సివిల్ జడ్జి విజయ తదితరులు

ఎలమంచిలి, జూలై 18 : హెల్మెట్ వినియోగంపై గురువారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోర్టు సముదాయం వద్ద తొలుత ర్యాలీని ఎలమంచిలి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. ద్విచక్ర వాహనచోదకులు వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరిస్తే ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చునని సూచించారు. అనంతరం న్యాయవాదులు, పోలీసు అధికారులు, విద్యార్థులతో కలిసి 'హెల్మెట్ వినియోగిద్దాం.. ప్రమాదాలను అరికడదాం..' అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ర్యాలీ ప్రధానరోడ్డు మీదుగా ఆర్టీసీ బస్‌స్టాండ్ జంక్షన్ వరకూ సాగింది. అనంతరం అక్కడ అంతా మానవహారంగా ఏర్పడి ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు ధూళి నూకరాజు, పెరుమాళ్ల వెంకటరమణ, డి.వెంకట్రావు, ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ, కోర్టు సిబ్బంది, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బూత్ స్థాయి నుంచి జనసేన బలోపేతం

▸ పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పిలుపు




పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడుతున్న కొణతాల

కొత్తూరు, జూలై 18 : బూత్ స్థాయి నుంచి జనసేన పార్టీని బలోపేతం చేయడమే అందరి లక్ష్యం కావాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం అనకాపల్లి పట్టణం గవరపాలెంలో పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల కంటే ఇక్కడ సభ్యత్వ నమోదులో ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో పక్కా రోడ్లు, తాగునీటి అవసరాలు కల్పించే బాధ్యత తమదన్నారు. అనంతరం అశోకచక్ర అవార్డు గ్రహీత కరణం వరప్రసాద్ తల్లిదండ్రులు వెంకటరమణ, సత్యవతిలకు పార్టీ కండువా వేసి సభ్యత్వం నమోదు చేశారు. పార్టీ నాయకులు చదరం నాగేశ్వరరావు, కర్రి సత్యనారాయణ, పీలా నాగశ్రీను, పావాడ కామరాజు, దూలం గోపీ, మంగా ఈశ్వర్, తాడి రామకృష్ణ, శ్రీరామదాస్ గోవింద, మళ్ల శ్రీను, భర్నికాన రాము, బుదిరెడ్డి చిన్న, విల్లూరి హరికృష్ణ, ఆళ్ల రామచంద్రరావు, వీర మహిళ శాంతికుమారి, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

'లక్ష్యానికి మించి సభ్యత్వ నమోదు చేయాలి'

నక్కపల్లి : చినదొడ్డిగల్లులో జనసేన సభ్యత్వ నమోదును ఆ పార్టీనేత గెడ్డం బుజ్జి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో అంతా లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు వెలగా సుధాకర్, నాయకులు గెడ్డం చైతన్య, గెడ్డం ఆకాశ్, జగన్నదొర, నల్లల రత్నాజీ, శివ, ఉమామహేశ్వరరావు, శ్రీను, రాజు, చరణ్, వాసు పాల్గొన్నారు.

రాంబిల్లి : హరిపురంలో జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభమైంది. పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర ప్రారంభించారు. నాయకులు ఉరిటి నానాజీ, చోడిపల్లి ప్రసాద్, జనసైనికులు పాల్గొన్నారు.

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెం, గుల్లేపల్లి, ఎల్లుప్పి, బోదువలస గ్రామాల్లో గురువారం జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ సోదరుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు భారీగా చేపట్టాలన్నారు. నాయకులు ఇందలి వెంకటరమణ, కర్రి కనకరాజు, సాలాపు వెంకటేశ్వరరావు, బోకం స్వామి నాయుడు, బంతికోళ్ల పద్మ, ఉగ్గిన రాము, బలిరెడ్డి రామకృష్ణ, బగ్గు ఈశ్వరరావు, సబ్బవరపు రవి తదితరులు పాల్గొన్నారు.

సుందర నగరంగా అచ్యుతాపురం : ఎమ్మెల్యే



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న విజయకుమార్

అచ్యుతాపురం, జూలై 18 : పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఇక్కడి జంక్షన్‌లో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను గురువారం సందర్శించారు. జంక్షన్‌లో పారితోషికం తీసుకున్న భవనాల కూల్చివేత త్వరితగతిన చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారి రాజును ఆదేశించారు. భవనాలను తొలగించిన వెంటనే విద్యుత్ స్తంభాలను తొలగించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరోజినితో పాటు వివిధ శాఖల అధికారులు ఆయన వెంట ఉన్నారు.

రైతు బాంధవుడు వీవీ రమణకు ఘన నివాళి



వీవీ రమణ చిత్రపటం వద్ద ప్రముఖుల నివాళి

అనకాపల్లి టౌన్/తుమ్మపాల, జూలై 18 : రైతు బాంధవుడు వీవీ రమణ వర్ధంతిని గురువారం ఇక్కడ నిర్వహించారు. పలువురు ప్రముఖులు రాజ్యసభ మాజీ సభ్యుడు వీవీ రమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ మాట్లాడుతూ దివంగత వీవీ రమణ కార్మిక, కర్షకుల ఆశాజ్యోతి అని పేర్కొన్నారు. తుమ్మపాల ప్రాంతంలో షుగర్ ఫ్యాక్టరీని నెలకొల్పి రైతాంగాన్ని ఆదుకున్నారని కొనియాడారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మళ్ల సాంబశివరావు, సీనియర్ పాత్రికేయులు వీవీ రమణమూర్తి, కర్రి దివాకర్, విల్లూరి రామచంద్రరావు, విల్లూరి రంగాజీ, రామునాయుడు, రాము, కోటిపల్లి శ్రీను, భీశెట్టి కృష్ణ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జల్లూరు వంతెన అప్రోచ్ పనులు ప్రారంభం



అప్రోచ్ పనులు జరుగుతున్న దృశ్యం

కోటవురట్ల, జూలై 18: జల్లూరు కొత్త వంతెన అప్రోచ్ పనులను అధికారులు ఎట్టకేలకు ప్రారంభించారు. ఈ వంతెన గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్న చందంగా నిలిచిపోయింది. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఎన్నికల ముందు వంతెన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గెలిచిన తర్వాత స్థానిక నాయకులతో కలిసి గతనెల 16వ తేదీన జల్లూరు పాత వంతెన, మధ్యలో ఆగిపోయిన వంతెన స్థితిగతులను పరిశీలించారు. నెల రోజులోగా వంతెన పనులు పూర్తిచేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆయన ఆదేశించారు. జల్లూరు వంతెన పనులు 2018 సంవత్సరంలో ప్రారంభించగా, 2019 నాటికి ఫీలర్స్ పనులు పూర్తిచేశారు. అప్పటి నుంచి మిగిలిన అప్రోచ్ రోడ్డు పనులు పెండింగ్‌లో ఉండిపోయాయి. కాంట్రాక్టర్‌కు రూ.62లక్షల వరకు బకాయిలు పెండింగ్‌లో ఉండిపోగా.. గత ప్రభుత్వం రూపాయి చెల్లించలేదు. ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బీ ఏఈ వద్ద ప్రస్తావించగా.. ఎంపీ సీఎం రమేశ్ ఆదేశాల మేరకు ప్రారంభించామన్నారు.

సర్పంచ్ నుంచి రక్షణ కల్పించాలని వినతి

అచ్యుతాపురం, జూలై 18 : సర్పంచ్ చుక్క అనూరాధ నుంచి తమకు రక్షణ కల్పించాలంటూ నునపర్తికి చెందిన నలభై కుటుంబాల రజకులు గురువారం తహసీల్దార్ సరోజినికి వినతి పత్రాన్ని అందజేశారు. నునపర్తి పంచాయతీ పరిధిలో సుమారు రెండు ఎకరాల గెడ్డ పోరంబోకులో తాము తాతల కాలం నుంచి బట్టలు ఉతుకుతూ జీవిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుత సర్పంచ్ చుక్క అనూరాధ ఈ భూమి తమకు చెందినదని ఎక్సవేటర్ సహాయంతో చదును చేయడానికి ప్రయత్నించగా, అడ్డుకున్నట్టు వారు చెప్పారు. స్థలం ఖాళీ చేయకపోతే పోలీసు కేసులు పెడతానని సర్పంచ్ బెదిరిస్తున్నారని వాపోయారు.


'పేట' భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ శిబిరాలు

పాయకరావుపేట, జూలై 18 : పట్టణంలోని భవిత కేంద్రంలో ప్రతి మంగళవారం ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహించనున్నామని ఎంఈవో-2 కె.రమేష్ తెలిపారు. గురువారం భవిత కేంద్రంలో ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. మానసిక, శారీరక, బహు వైకల్యం కలిగిన దివ్యాంగ విద్యార్థుల కోసం ఇక నుంచి ప్రతి మంగళవారం ఫిజియోథెరపీ క్యాంపు ఉంటుందని చెప్పారు. అనంతరం ఫిజియోథెరపిస్టు సీహెచ్.అనూష పలువురు విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు బి.విజయ్‌కుమార్, ఎం.క్రాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట, జూలై 18 : స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ తెలిపారు. ఈ కారణంగా కశింకోట, బయ్యవరం, విస్సన్నపేట, రామన్నపాలెం, తేగాడ, వెదురుపర్తి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

చినదొడ్డిగల్లులో సత్తెమ్మతల్లి జాతర




అమ్మవారి దర్శనానికి ఆలయం వద్ద బారులుతీరిన భక్తులు

నక్కపల్లి, జూలై 18 : మండలంలోని చినదొడ్డిగల్లులో గురువారం సత్తెమ్మతల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. ఏటా ఆషాఢ మాసంలో ఈ వేడుక జరుపుతుండడం ఆనవాయితీ. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారికి పసుపు కుంకుమలను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం వద్ద భక్తుల తాకిడి కొనసాగింది. సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ సన్ని బాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కమిటీ సభ్యుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'గొర్రెలు, మేకల పెంపకందారులకు షెడ్లు నిర్మించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరామ్

అనకాపల్లి టౌన్, జూలై 18 : గొర్రెలు, మేకల పెంపకందారులకు 90 శాతం సబ్సిడీతో ఉపాధి హామీ పథకం ద్వారా షెడ్లను నిర్మించి ఇవ్వాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరామ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఇక్కడ ఏర్పాటైన సంఘ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్థక శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు గేదెలు, ఆవుల పెంపకందారులకు 90 శాతం సబ్సిడీతో, గొర్రెలు, మేకల పెంపకందారులకు 70 శాతం సబ్సిడీతో ఉపాధి పథకం ద్వారా షెడ్లు నిర్మిస్తామని తెలిపారన్నారు. పెద్ద పశువుల మాదిరిగానే గొర్రెలు, మేకలకు కూడా 90 శాతం సబ్సిడీతో షెడ్లు నిర్మించాలని కోరారు. అంటువ్యాధుల వల్ల వేలాది జీవాలు మృత్యువాత పడుతున్నాయని, వాటి నిర్మూలనకు వెంటనే నట్టల నివారణ మందులతో పాటు అవసరమైన వ్యాక్సినేషన్ ఉచితంగా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఉరిగిటి శివ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గోకాడ దేముడునాయుడు, సబ్బి శ్రీనివాసరావు, పినబోయిన అప్పారావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోజంతా చిరుజల్లులే..

▸ ముసురు వాతావరణంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు



కోటవురట్లలో ఉదయం కురుస్తున్న చిరుజల్లులు

కోటవురట్ల/రాంబిల్లి, జూలై 18 : అల్పపీడనం కారణంగా జిల్లాలోని పలు మండలాల్లో గురువారం ఉదయం నుంచి ముసురు వాతావరణం నెలకొంది. రోజంతా చిరుజల్లులు పడుతూనే ఉండడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వ్యాపారాలు సరిగ్గా సాగక చిరువ్యాపారులు నష్టపోయారు. వివిధ పనులపై బయటకు వెళ్లేవారు, విద్యార్థులు తడుసుకుంటూ వారి పనుల్లో వారు నిమగ్నమయ్యారు. ఇక రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. కోటవురట్ల, రాంబిల్లి తదితర మండలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. గ్రామీణ ప్రాంత రోడ్లు బురదమయంగా మారాయి. పల్లెవాసులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే తాజా వాతావరణం పంటల సాగుకు ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీవారి ఆలయంలో ధ్వజారోహణం



ఆలయంలో ధ్వజారోహణం జరుపుతున్న అర్చకులు

అనకాపల్లి టౌన్, జూలై 18 : పట్టణంలోని దేముని గుమ్మం వేంకటేశ్వర ఆలయంలో శ్రీవారి పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం ప్రధాన అర్చకులు పులకండం విజయబాబు, గిరిబాబు ఆధ్వర్యంలో ధ్వజారోహణం కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే, స్వామివారి ఉత్సవమూర్తికి బేడా సేవ జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈపూజల్లో ఈవో రాజ సులోచన, ఆలయ పర్యవేక్షకులు సకల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న పీలా గోవింద

కొత్తూరు, జూలై 18 : అనకాపల్లి మండలం రొంగలివానిపాలెంలో మరిడిమాంబ పండగ గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. పలువురు టీడీపీ నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పరవాడపాలెంలో పడమటమ్మతల్లి పండగ

కశింకోట, జూలై 18 : పరవాడపాలెంలో పడమటమ్మ తల్లి పండగ గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు దాడి రత్నాకర్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీవిద్యా ఉపాసన కోర్సు ప్రారంభం

సబ్బవరం, జూలై 18 : మండలంలోని దేవీపురంలో గల రాజరాజేశ్వరీ సహస్రాక్షి అమ్మవారి పీఠంలో గురుమాత అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో శ్రీవిద్యా ఉపాసన కోర్సు ప్రారంభమైంది. ఈ విద్యనభ్యసించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పలువురు వచ్చినట్టు గురుపత్ని అన్నపూర్ణమ్మ తెలిపారు. వివిధ బోధన పరికరాల ద్వారా కోర్సు పూర్తవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవిద్యా ట్రస్టు నిర్వాహకులు కందర్ప ప్రభాకర్, రమా తదితరులు పాల్గొన్నారు.

'అదనపు వసతి గృహాలు ఏర్పాటు చేయాలి'

తుమ్మపాల, జూలై 18 : జిల్లా కేంద్రం అనకాపల్లిలో అదనంగా మరో రెండు బాలికల వసతిగృహాలను ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు కోరారు. గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ అనకాపల్లిలో విద్యనభ్యసించేందుకు నలుమూలల నుంచి వస్తున్న ఆడపిల్లలకు వసతి లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఉన్న వసతి గృహాల్లో కేవలం 70 నుంచి 80 మంది మాత్రమే ఉండడానికి అవకాశముందని, కానీ కొన్నిచోట్ల 150 మంది విద్యార్థినులు వసతి గృహాల్లో కొనసాగుతున్నారని వాపోయారు. వీరి ఇబ్బందుల దృష్ట్యా ప్రభుత్వం అదనపు వసతి గృహాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు పరవాడ మండల సర్వసభ్య సమావేశం

పరవాడ, జూలై 18 : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పరవాడ మండల పరిషత్ సర్వ సమావేశం జరగనుందని ఎంపీడీవో కీర్తిస్పందన ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశం ఉదయం పది గంటలకు ప్రారంభం కానుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పంచకర్ల హాజరు కానున్నారని వివరించారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు ఆయా శాఖ అధికారులు పాల్గొనాల్సిందిగా కోరారు.

అగ్ని బాధిత కుటుంబానికి టీడీపీ చేయూత

నక్కపల్లి, జూలై 18 : మత్స్యకార గ్రామం రాజయ్యపేటలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో పిక్కి పాపయ్యమ్మకు చెందిన పూరిల్లు కాలిబూడిదైన సంగతి తెలిసింది. దీంతో బాధిత కుటుంబానికి రూ.20 వేల నగదు, బియ్యాన్ని టీడీపీ నాయకులు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మత్స్యకార నాయకులు పిక్కి శ్రీను, సత్తియ్య, రాంబాబు, గంగరాజు, కోటి, కోదండరావు, మడదా రాంబాబు, వాసపల్లి రాము, దేముడు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరాపల్లిలో లెప్రసీ కేస్ నిర్ధారణ సర్వే

ఎస్.రాయవరం, జూలై 18 : సర్వసిద్ధి పీహెచ్‌సీ పరిధిలోని ఉప్పరాపల్లిలో లెప్రసీ కేస్ నిర్ధారణ సర్వేను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.వాసంతి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంటిపై స్పర్శలేని, దురద లేని, తిమ్మిర్లుగా ఉండే మచ్చలు ఉన్నవారంతా తమ ఆరోగ్య సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు చూపించాలన్నారు. వ్యాధిని మొదటి దశలోనే గుర్తిస్తే త్వరగా కోలుకోవచ్చునని సూచించారు. ఆరోగ్య విస్తరణాధికారి టి.నాగేశ్వరరావు, హెచ్ఎస్ ఎస్ఎస్‌పీ ప్రకాష్, హెచ్‌వీ వై.సూర్యకుమారి పాల్గొన్నారు.

పాఠశాలలకు మొక్కలు పంపిణీ

అచ్యుతాపురం/రూరల్, జూలై 18 : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని హరిపాలెం సత్యసాయి భజన మండలి సభ్యులు అన్నారు. గురువారం స్థానిక కస్తూర్బా పాఠశాలతో పాటు ఉన్నత పాఠశాలలో మామిడి, నేరేడు, నల్లమద్ది, దానిమ్మ మొక్కల పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాజు, కామరాజు, బి.సుబ్రహ్మణ్య స్వామి, రాజశేఖర్, రామారావు, శంకర్, పీఎస్‌టీ పట్నాయక్, పాండురంగారావు, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదల తొలగింపు

పరవాడ, జూలై 18 : జాజులవానిపాలెం నుంచి పి.బోనంగి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను సర్పంచ్ బండారు కల్పనా రాజశేఖర్ ఆధ్వర్యంలో గురువారం ఎక్సకవేటర్ సహాయంతో తొలగించారు. ముళ్ల పొదలు పెరిగిపోవడంతో వాహనదారుల ఇబ్బందులు గుర్తించి ఈ చర్యలు చేపట్టినట్టు సర్పంచ్ తెలిపారు.

పుస్తకాల వ్యాపారి కాశీ కన్నుమూత



కాశీ (ఫైల్ ఫొటో)

అనకాపల్లి టౌన్, జూలై 18 : అనకాపల్లి తూర్పు కాపు సంఘం పెద్దలు, ప్రముఖ పుస్తకాల వ్యాపారి కోరుకొండ కాశీలు (కాశీ) గురువారం కన్నుమూశారు. ఈయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కోట్నివీధిలోని నివాసంలో తుది శ్వాస విడిచారు. సమాజంలో అనేక సేవా కార్యక్రమాలు చేసిన కాశీ మృతి చెందిన విషయం తెలుసుకున్న ప్రముఖులు, తూర్పు కాపు సంఘం ప్రతినిధులు, రాజకీయ నాయకులు విచ్చేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

23 నుంచి ఆధార్ క్యాంపులు

నాతవరం, జూలై 18 : ఈ నెల 23 నుంచి 27వరకు సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో జె.రాంబాబు తెలిపారు. గురువారం ఆయన వైడీపేట సచివాలయాన్ని సందర్శించి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఐదు సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికి ఆధార్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. అలాగే అలాగే ఆధార్‌లలో ఏవైనా మార్పులు ఉంటే చేసుకునే వీలుంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వెన్నలపాలెం మర్రిపాలెం గ్రామాల్లో రక్షిత తాగునీటి ట్యాంకులపైకి ఎక్కి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

▸▸ డిప్యూటీ డీఈవో అప్పారావు



మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

కృష్ణాదేవిపేట, జూలై 18 : కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో విద్యను అందించాలని డిప్యూటీ డీఈవో పి.అప్పారావు ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం గొలుగొండ మండలం చోద్యం, ఏఎల్‌పురం హైస్కూల్‌ను సందర్శించిన ఆయన బోధనా విధానాన్ని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నం భోజన పథకం నిర్వాహకులతో మాట్లాడారు. ఏఎల్‌పురం కొత్తగా ఏర్పాటు చేసిన ప్రైవేటు పాఠశాలల్లో సదుపాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఎంఈవో సత్యనారాయణ, హెచ్‌ఎం జి.రత్నాజీ, నాగభూషణం, సీఆర్‌పీలు సత్యనారాయణ, అప్పలనాయుడు, రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరం

నర్సీపట్నం, జూలై 18 : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విశాఖపట్నం గీతం దంత వైద్య కళాశాల సౌజన్యంతో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. గురువారం స్థానిక వాసవీ కల్యాణ మండపంలో 144 మందికి దంత పరీక్షలు చేశారు. ప్రొఫెసర్ డాక్టర్ బి.శ్రీనివాస్, దంత వైద్యులు వి.నితిన్, వి.వైష్ణవి, వైపీ రమ్యశ్రీ, బి.లయశ్రీ, జరీనా, వి.ఖ్యాతి దేవి, వి.నవ్య దంత సమస్యలతో బాధ పడుతున్న రోగులకు వైద్య పరీక్షలు చేసి దంత సంరక్షణకు తీసుకోవల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాలమూరి బంగార్రాజు. వెలగానారాయణరావు, పూసర్ల సోమేశ్వరావు, రోటరీ క్లబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌పై సర్పంచుల మధ్య వాగ్వాదం

వాడివేడిగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

నర్సీపట్నం, జూలై 18 : గత ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో టీడీపీ సర్పంచ్‌లను కలుపుకొని పోలేదని, ఇప్పుడు తామెందుకు కలుపుకొని వెళ్లాలని గబ్బాడ సర్పంచ్ ఈర్లె రాజేశ్వరి ప్రశ్నించారు. గురువారం ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ కార్యక్రమాల్లో సర్పంచ్‌ల ప్రొటోకాల్ అంశంపై వాడివేడి చర్చ జరిగింది. ఏఎల్‌పురం వైసీపీ సర్పంచ్ బంటు నాగేశ్వరరావు, ధర్మసాగరం సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రామలలో వైసీపీ సర్పంచ్‌లను దూరం పెడుతున్నారన్నారు. ఈ అంశంపై వైసీపీ, టీడీపీ సర్పంచ్‌ల మధ్య చర్చ సాగింది. దీనిపై ఎంపీడీవో జాన్ లింగన్ మాట్లాడుతూ సర్పంచ్ గ్రామ ప్రథమ పౌరుడని, ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రోటోకాల్ ప్రకారం సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు, జెడ్పీటీసీకి ఆహ్వానం పంపుతామన్నారు. జడ్పీటీసీ సుకల రమణమ్మ మాట్లాడుతూ మండలంలో ఆర్‌జేఎల్ విత్తనాలు ఎక్కువగా వేస్తారని, రైతులకు అవసరమైన విత్తనాలు తీసుకురాకుండా పనికి రాని విత్తనాలు తీసుకు వచ్చారని అన్నారు. వేములపూడి ఎంపీటీసీ రాంప్రసాద్ మాట్లాడుతూ సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయా అని ప్రశ్నించారు. ఏవో అప్పారావు మాట్లాడుతూ ఎరువులు త్వరలో వస్తాయని సమాధానమిచ్చారు. ఏఎల్‌పురం సర్పంచ్ నాగేశ్వరావు మాట్లాడుతూ గబ్బాడ పంచాయతీ నుంచి ఓఎల్ పురం గ్రామం విడిపోయిన తర్వాత సరిహద్దులు సరిగ్గా నిర్ణయించలేదని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గురొందరపాలెం సర్పంచ్ చినబాబు మాట్లాడుతూ గ్రామ సచివాలయం భవనం వద్ద బోరు వేయించాలని కోరారు. ఎంపీపీ సుర్ల రాజేశ్వరి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, శుభ్రమైన తాగునీరు సరఫరాకు ప్రాధాన్యమివ్వాలని అన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ రమణబాబు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైసీపీ నేతల గుప్పిట్లో లేటరైట్

... 5వ పేజీ తరువాయి

శోభా సత్యసాగర్ రూ.70.12 లక్షలు, శోభా అప్పలరాజు రూ.70.19 లక్షల ప్రీమియంకు టెండరు కోట్ చేశారు. తరువాత వీరికి 20 ఏళ్లకు లీజు మంజూరుచేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వెంటనే ఇద్దరు లీజుదారులు తాము కోట్ చేసిన విధంగా ప్రీమియం మొత్తం గత డిసెంబరులోనే చెల్లించడంతో అప్పటి గనుల శాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. ఇద్దరు లీజుదారులకు ఈ ఏడాది ఫిబ్రవరి 21న లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌వోఐ) జారీచేయగా వాటి ప్రతులు ఆ మరుసటిరోజు అంటే 22న నర్సీపట్నంలో గనులశాఖ సహాయ సంచాలకుల కార్యాలయానికి అందాయి. నిబంధనల మేరకు ఎల్‌వోఐ జారీ చేసిన తేదీ నుంచి మూడేళ్లలో మైనింగ్ ప్లాన్‌ను గనుల శాఖకు అందజేయాలి. తరువాత పర్యావరణ, అటవీ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. ఇంకా తవ్వకాలకు కాలుష్య నియంత్రణ మండలి నుంచి కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్ (సీఎఫ్‌ఎ), తరువాత కన్సెంట్ ఫర్‌ఆపరేషన్స్ (సీఎఫ్‌వో) తీసుకుని గనుల శాఖకు అందజేస్తే అప్పుడు లేటరైట్ తవ్వుకోవడానికి అధికారికంగా అనుమతులు జారీచేస్తారు. గత ప్రభుత్వ హయాంలో బినామీల పేరిట వైసీపీ నేతలు సుందరకోట పంచాయతీలో లేటరైట్ తవ్వకాలకు లీజులు పొందిన విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. దీనిపై సమగ్ర విచారణ జరపాలని భావిస్తున్నట్టు సమాచారం.

సాగు, తాగునీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యం

... 5వ పేజీ తరువాయి

గుర్తించాం. ప్రధానంగా గ్రామ పంచాయతీల పరిధిలో పరిశుభ్రత పనులు నిర్వహించి పల్లె ప్రజలు ఆరోగ్యంగా ఉండే విధంగా అవసరమైన అన్ని చర్యలు చేపడతాం. ఇప్పటికే మునిసిపల్, గ్రామ పంచాయతీ అధికారులతో పల్లెల్లో పారిశుధ్యం మెరుగుదలకు అవసరమైన పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించాం.

ప్రజా ఫిర్యాదులపై జవాబుదారీతనం

రెవెన్యూ శాఖలో ప్రజా ఫిర్యాదులు ఎక్కువ సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నట్టు గుర్తించాం. భూవివాదాలు, రెవెన్యూ రికార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం దరఖాస్తులు ఎక్కువగా వస్తున్నాయి. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మండలాలు, చిన్నగ్రామాల నుంచి ప్రజలు వస్తున్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం. 30 రోజులలోగా అర్జీకి మొక్కుబడిగా సమాధానం చెబుతున్న అధికారులవివరాలను సేకరిస్తున్నాను. ఇందులోభాగంగానే శాఖల వారీగా ప్రతివారం అర్జీలు ఎన్ని వస్తున్నాయనేది గుర్తిస్తున్నాం.

పరిశ్రమల్లో భద్రతా చర్యలపై నిఘా

జిల్లాలో 183 పరిశ్రమలు ఉన్నాయి. ఆయా పరిశ్రమల్లో వేలాది మంది ఉద్యోగులు, కార్మికులు ఉన్నారు. ఇటీవల అచ్యుతాపురంలోని ఫార్మా కంపెనీలో అగ్ని ప్రమాదం జరిగి ఓ కార్మికుడు చనిపోవడం విచారకరం. గతంలోనూ ఇటువంటి సంఘటనలు అనేకం ఫార్మా కంపెనీల్లో జరిగాయి. తరచూ ప్రమాదాలు జరగడానికి గల కారణాలను గుర్తించి, శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టే దిశగా పరిశ్రమల శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. పరిశ్రమల్లో భద్రతా చర్యలు ఎలా ఉన్నాయని ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన సిబ్బంది కొంత నిర్లక్ష్యం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇక ముందు తనిఖీల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించాం. పరిశ్రమల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి భద్రతా చర్యల విషయంలో రాజీ పడవద్దని సూచించాం.

జ్వరాల తీవ్రతపై అప్రమత్తం

జిల్లాలో వర్షాలు కురుస్తుండడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కొన్నిచోట్ల వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. వైద్య సిబ్బంది గ్రామాల్లోనే ఉండి వైద్యపరమైన సేవలు అందించాలని ఆదేశించాం. అవసరం మేరకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, మలేరియా రక్తపూతల సేకరణ జరిపి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలని ఆదేశించాం. మందుల కొరత లేకుండా ముందస్తు ఇండెంట్ పెట్టుకొని అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాం.

మౌలిక వసతుల మెరుగుకు చర్యలు

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. తక్షణం మరమ్మతులు చేయాల్సిన రోడ్ల వివరాలు సేకరించాలని ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖాధికారులను ఆదేశించాం. పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణ పనులు చాలా వరకు పూర్తికాలేదు. ఎన్నికల ముందు నిలిచిపోయిన నిర్మాణ పనులను పూర్తి చేయాలని సర్వశిక్షా అభియాన్ అధికారులు, విద్యాశాఖాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం.

ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడితే కేసులు

▸▸ తహసీల్దార్ మురళీమోహన్‌రావు



జి.కోడూరులో ఇసుక ర్యాంపులను పరిశీలిస్తున్న తహసీల్దార్

మాకవరపాలెం, జూలై 18 : మండలంలో జంగాలపల్లి నుంచి అనుమతులు లేకుండా తలరిస్తున్న మూడు ఇసుక ట్రాకర్లను సీజ్ చేసి జరిమానా విధించినట్టు తహసీల్దార్ మురళీమోహన్‌రావు తెలిపారు. ఇసుకతో పట్టుబడిన ట్రాక్టర్లకు రూ.పదివేలు చొప్పున జరిమానా విధించామన్నారు. గురువారం జి.కోడూరులో డి.పట్టా భూముల్లో ఉన్న ఇసుక నిల్వలతో పాటు సర్పానదిలో ఉన్న ఇసుక నిల్వలను తహసీల్దార్ పరిశీలించారు. అలాగే బిఎస్‌పేటలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలను కూడా పరిశీలించారు. ఇసుక నిల్వలపై పూర్తి నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి, సర్వేడీటి కృష్ణమూర్తి, మైనింగ్ అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

▸▸ సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటరమణ

గొలుగొండ, జూలై 18 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2024 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు తప్పక అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అన్నారు. మండలంలోని గురువారం ఎర్రవరం రాజుల బాబు గుడివద్ద ఏర్పాటైన సీపీఐ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలన్నారు. కార్పొరేట్ సంస్థలకు పలు కార్యక్రమాలు అప్పగించకుండా ప్రభుత్వ హయాంలో నిర్వహించాలన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి అందాల్సిన నిధులు మంజూరు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ భూ సంరక్షణ పథకంలో అనేక భూ సమస్యలు విలయతాండవం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, జి. గురుబాబు, మేకా సత్యనారాయణ, మేకా భాస్కరరావు, జి. రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబా ఆలయ కమిటీ రాజీనామా

నర్సీపట్నం, జూలై 18 : శ్రీ షిర్డీ సాయిబాబు ఆలయ కమిటీ నుంచి స్వచ్ఛందంగా తప్పుకుంటున్నామని అధ్యక్షుడు కర్రి రాంగోపాల్ తెలిపారు. గురువారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మారిన రాజకీయ సమీకణాల నేపథ్యంలో ఆలయ కమిటీని మార్చాలని కొందరు వ్యక్తులు కోరారన్నారు. దీంతో ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్‌తో సహా 18 మంది కమిటీ సభ్యులు స్వచ్ఛందంగా బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్టు తెలిపారు. కొత్త కమిటీ ఏర్పాటు చేసే వరకు పాత కమిటీలో కార్యదర్శిగా ఉన్న డాక్టర్ వి.రామచంద్రరాజు, ట్రెజరర్ లంక ఈశ్వరరావులకు తాత్కాలింగా గుడి లావాదేవీలు అప్పగించామని తెలిపారు. బంగారు, వెండి ఆభరణాలు కూడా వారిద్దరికీ అప్పగించామని తెలిపారు.

జనసేన సభ్యత్వ నమోదు



రశీదులు చూపుతున్న జనసైనికులు

నర్సీపట్నం అర్బన్, జూలై 18 : జనసైనికులు తప్పక క్రియాశీల సభ్యత్వాలు నమోదు చేసుకోవాలని నర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. పట్టణంలో గురువారం జనసేన పార్టీ సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరసూర్యచంద్ర మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం పొందిన సభ్యులకు ప్రమాద బీమా రూ. ఐదు లక్షలు, మెడికల్ ఇన్సూరెన్స్ యాభైవేల రూపాయలు అందించేందుకు పార్టీ నిర్ణయించిందన్నారు. ఈ అవకాశాన్ని జనసేన సైనికులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు అద్దేపల్లి గణేష్, నాలుగు మండలాలకు చెందిన జనసేన అధ్యక్షులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు పూర్వ విద్యార్థుల ప్రోత్సాహకాలు



ప్రోత్సహకాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

గొలుగొండ, జూలై 18 : మండలంలోని జోగంపేట జడ్పీ హైస్కూల్లో 2023-24 విద్యా సంవత్సరంలో పదోతరగతిలో స్కూల్ ఫస్ట్ సాధించిన విద్యార్థి మాకిరెడ్డి కౌసిక్ భరత్‌తో పాటు మరో ఇద్దరు విద్యార్థులకు పూర్వపు విద్యార్థుల సంఘం(జోషా) ఆధ్వర్యంలో గురువారం నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానం పొందిన మాకిరెడ్డి కౌసిక్ భరత్‌కు రూ.పది వేలు, ద్వితీయ స్థానం సాధించిన యాళ్ళ మౌనికకు రూ.ఐదువేలు, తెలుగు సబ్జెక్టులో మంచి మార్కులు సాధించిన ఎల్.దుర్గాభవానీకి రూ.రెండు వేల చొప్పున ప్రోత్సాహకాలు అందించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న పూర్వపు విద్యార్థి మడ్డు మల్లేశ్వరరావుకు రూ.పదివేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో అప్పారావు, ఇన్‌చార్జి ఎంఈవో సత్యనారాయణ, స్థానిక హెచ్‌ఎం సరోజినీ, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు రాయపురెడ్డి జమీలు, కార్యదర్శి గండేపల్లి శ్రీరామ్మూర్తి, పూర్వపు విద్యార్థులు కిరణ్, నాగు, శ్రీనివాసరావు, గోవింద రాజులు, నానాజీ పాల్గొన్నారు.

చోడవరం
నియోజకవర్గం

గోవాడలో జనసేన సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదును నిర్వహిస్తున్న నాయకులు

చోడవరం, జూలై 18 : గోవాడ పంచాయతీలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షుడు అల్లం రామప్పారావు సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టారు. అంతా సభ్యత్వం పొందాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏడువాక నూకరాజు, కరణం శేఖర్, బండి బుజ్జి, మాజీ ఎంపీటీసీ అల్లం మాధవి తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం వాసుల ఆధ్వర్యంలో సింహాచలంలో అన్నసమారాధన రేపు

చోడవరం, జూలై 18 : సింహాచలం నృసింహస్వామి గిరి ప్రదక్షిణ సందర్భంగా మండలంలోని గజపతినగరం గ్రామస్థుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్టు మాజీ జడ్పీటీసీ, టీడీపీ నాయకుడు కనిశెట్టి మత్స్యరాజు తెలిపారు. ఈ నెల 20వ తేదీ శనివారం విశాఖలోని సింహాచలం దరి కొత్తగోశాల వద్ద గిరి ప్రదక్షిణ చేసే భక్తుల కోసం ఈ అన్నసమారాధన జరపనున్నామన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఈ వేడుకను విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

గ్రామాల్లో అమ్మవార్ల వేడుకలు



పూజలు చేస్తున్న భక్తులు (ఇన్‌సెట్) అమ్మవారిని దర్శించుకుంటున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, జూలై 18 : మండలంలో గురువారం ఆరు గ్రామాల్లో అమ్మవార్ల పండగలను ఘనంగా నిర్వహించారు. వడ్డాది, మంగళాపురం, కొండెంపూడి గ్రామాల్లో మరిడిమాంబ వేడుక, నీలకంఠాపురం, ఎం.భూపతిపాలెం, పోలేపల్లి గ్రామాల్లో భూలోక పండుగ సందర్భంగా ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పసుపు, కుంకుమలను సమర్పించి పెద్ద సంఖ్యలో భక్తులు మొక్కులను చెల్లించుకున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, వడ్డాది పట్టణ టీడీపీ అధ్యక్షుడు దొండా నరేష్, ఆలయ కమిటీ చైర్మన్ అమరిపల్లి సత్తిబాబు, టీడీపీ నాయకులు దొండా గిరిబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రావికమతం : కొత్తకోటలో మరిమాంబ పండగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. వేకువ జాము నుంచే పొలాల్లో ఉన్న వేప చెట్ల వద్దకు వెళ్లి అక్కడ కొలువుదీరిన అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా ఆషాఢ మాసంలో వరి నాట్లు వేసే ముందు ఈ అమ్మవారి పండగను జరుపుతుండడం ఆనవాయితీ. ఈ సందర్భంగా నేలవేషాలు, తప్పెటగుళ్ల, బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి.

స్వయంభూ గౌరీశ్వర సన్నిధిలో యాగాలు



యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తదితరులు

చోడవరం, జూలై 18 : పట్టణంలోని ప్రముఖ స్వయంభూ గౌరీశ్వరాలయంలో చండీశ్రీ శ్రీరుద్ర మహాయాగం నిర్విఘ్నంగా కొనసాగుతోంది. బుధవారం ప్రారంభమైన ఈ వేడుక ఈనెల 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతి సారథ్యంలో కాకినాడకు చెందిన శ్రీపాద అవధాని, బులుసు ప్రభాకర శర్మల పర్యవేక్షణలో వేదపండితులు ఈ యాగాన్ని కొనసాగిస్తున్నారు. గురువారం గణపతి పూజతో ప్రారంభించి లక్ష్మీగణపతి, చండీ సప్తపతి తదితరాలను కొనసాగించారు. సహస్ర లింగార్చన, మహాన్యాసం, విశేష అభిషేకాలను నిర్వహించారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుతో పాటు, పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, స్థానిక ప్రముఖులు ధర్మతేజ రెడ్డి, ఇతర ప్రముఖులు, పెద్ద సంఖ్యలో పట్టణవాసులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ



హెల్మెట్ వాడకంపై ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు, పోలీసులు, విద్యార్థులు

చోడవరం, జూలై 18 : మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఈ.రాజేంద్రబాబు ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకంపై గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ వాడండి.. ప్రాణాలు కాపాడుకోండి అంటూ.. న్యాయవాదులు, పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పించడంతో పాటు, వారికి పూలు అందించారు. ఈ ర్యాలీలో ఏపీపీ వేసలపు వెంకటరావు, స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కాండ్రేగుల డేవిడ్, గొర్లె కృష్ణవేణి, చీపురుపల్లి సూర్యనారాయణ, గూనూరు లక్ష్మీనారాయణ, పోలీసులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ ఎస్ పీవోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బకాయిలు కోరుతూ ఉపాధి కూలీల ఆందోళన



నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

రోలుగుంట, జూలై 18 : ఆరు వారాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ కూలి డబ్బుల బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరుతూ బుధవారం మండలంలోని కొంతలంలో కూలీలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ ఉపాధి కూలీలకు సకాలంలో చెల్లింపులు చేపట్టకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రోలుగుంట మండలంలోని 24 పంచాయతీల్లో దాదాపు రూ.రెం కోట్లకు పైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నేతలు బాలరాజు, ఈశ్వరరావు, లక్ష్మి పాల్గొన్నారు.

'ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక దృష్టి'

కె.కోటపాడు, జూలై 18 : ప్రజారోగ్య పరిరక్షణకు వైద్య సిబ్బంది మరింత అంకితభావంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లూసి కార్డిలియా సూచించారు. మండలంలోని గవరపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్‌ను గురువారం ఆమె సందర్శించారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌ను ప్రారంభించి మాట్లాడారు. వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా మరింత అప్రమత్తంగా ఉండాని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో డీపీహెచ్ఎన్‌వో డి.నాగమణి, గణాంకాధికారి రామచంద్రరావు, డేట్స్ మేనేజర్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ అల్లానికి గిట్టుబాటు ధర కరువు

▸▸ గిరిజనులు డీలా



అమ్మకానికి సిద్ధంగా ఉన్న అల్లం

చీడికాడ, జూలై 17: ఏజెన్సీ గ్రామాల నుంచి కోనాం సంతకు గురువారం వచ్చిన అల్లానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో గిరిజనులు నిరాశకు గురయ్యారు. ఏజెన్సీ గిరిజన గ్రామాల నుంచి అల్లాన్ని కావిడి మోతతో అటవీ ప్రాంతంలో కాలిబాటన గురువారం కోనాం సంతకు తీసుకు వచ్చిన గిరిజన రైతులు డీలా పడ్డారు. ఓ వైపు చినుకులు పడడంతో ఆశించిన స్థాయిలో వ్యాపారులు సంతకు రాకపోవడంతో మధ్యాహ్నం ఒంటి గంట వరకు అల్లం అమ్మకాలు సాగలేదు. పట్టణ ప్రాంతాల్లో కిలో రూ.200లు ఉన్న అల్లానికి కోనాం సంతలో కిలో రూ.100 నుంచి రూ.110లు చొప్పున ధర పలకడంతో మధ్యాహ్నం వరకు వేచిచూసిన గిరిజనులు వ్యాపారులు అడిగిన ధరకు అల్లం విక్రయించి నిరాశతో వెనుతిరిగారు.

మాడుగుల
నియోజకవర్గం

ఘనంగా మారిడిమాంబ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల, జూన్ 18 : మండల కేంద్రం మాడుగులలో మరిడిమాంబ జాతరను గురువారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, మోదకొండమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేయడంతో ఇక్కడ సందడి వాతావరణం నెలకొంది. ఆలయంతో పాటు, వేప చెట్టు దగ్గర వెలసిన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా అమ్మవారి శతకంపట్టు వద్ద నుంచి ఘటాలు, పాదాలను తిరిగి ప్రధాన ఆలయానికి ఊరేగింపుగా తీసుకొని వెళ్లారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. గ్రామానికి చెందిన కె.వెంకటరావు జ్ఞాపకార్థ ఆయన కుటుంబ సభ్యులు అమ్మవారికి వెండి కిరీటాన్ని సమర్పించారు.

ఎ.కొత్తపల్లిలో...



ఎ.కొత్తపల్లి వేడుకల్లో ఎమ్మెల్యే బండారు తదితరులు

దేవరాపల్లి : ఎ.కొత్తపల్లిలో గ్రామదేవత మరిడిమాంబ ఒడ్డు పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు జరిపారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, మాజీఎ మ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, పెద్దాడ వెంకటరమణ పాల్గొన్నారు.

పాండవుల మెట్ట వద్ద గిరిప్రదక్షిణ రేపు

దేవరాపల్లి, జూలై 18 : మండలంలోని మారేపల్లి గ్రామ సమీపంలో గల పాండవుల మెట్ట వద్ద కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త ఆవుగడ్డ రామ్మూర్తినాయుడు తెలిపారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని శనివారం ఉత్తర వాహిని శారదానది తీరాన ఉన్న స్వామివారి ఆలయం వద్ద నుంచి సాయంత్రం నాలుగు గంటల నుంచి గిరిప్రదక్షిణ ప్రారంభం కానుందన్నారు. ఆలయం మెట్ల నుంచి ప్రారంభమై వాకపల్లి ముత్యాలమ్మ తల్లి జంక్షన్ వెంకటరాజపురం, తెనుగుపూడి భీమలింగేశ్వరాలయం, మారేపల్లి బీసీ కాలనీ మీదుగా తిరిగి స్వామి ఆలయానికి చేరుకుంటారన్నారు. ఏడు కొండలు ఏడు కిలోమీటర్లు సాగే ఈ గిరిప్రదక్షిణలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.